

దుద్దెడలోని స్వయంభూ శంభు ఆలయం

నేటి నుంచి శంభు దేవుడి జాతర

కొండపాక, ఫిబ్రవరి 4: మండలంలోని దుద్దెడ గ్రామంలో మహాశివుడు స్వయంభు లింగ రూపంలో వెలిసిన శంభు దేవుడి ఆలయంలో నేటి నుంచి మూడు రోజుల పాటు వార్షిక బ్రహ్మోత్సవాలు జరుగనున్నాయి. ఈ ఉత్సవాలకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకోనున్నారు. నేడు పుష్య బహుళ దశమి సోమవారం విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవాచనం, అంకురార్పణ, మూలవిరాట్ అభిషేకంతోపాటు శకటోత్సవం (బండ్ల పండుగ) ఉత్సవాలు ప్రారంభమవుతాయి.

మాజీ మంత్రి హరీశ్‌రావుకు ఆహ్వానపత్రిక అందజేస్తున్న కుమార్‌యాదవ్, తదితరులు

మాజీ మంత్రి హరీశ్‌రావుకు ఆహ్వానం

కొండపాక, ఫిబ్రవరి 4: హైదరాబాద్‌లో మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావును ఆదివారం ఆయన నివాసంలో బీఆర్ఎస్ కొండపాక మండలాధ్యక్షుడు నూనె కుమార్‌యాదవ్ కలిశారు. మండలంలోని దుద్దెడ శంభూదేవాలయంలో నేటి నుంచి మూడు రోజులపాటు జరిగే బ్రహ్మోత్సవాలకు హాజరుకావాలని కోరుతూ ఎమ్మెల్యేకు ఆహ్వాన పత్రిక అందజేశారు. ఎమ్మెల్యేను కలిసినవారిలో ఆత్మ కమిటీ మాజీ డైరెక్టర్ సున్నం భాస్కర్ ముదిరాజ్, నాయకులు గాదగొని రాకేశ్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

భూదాతల విగ్రహాల ఏర్పాటుకు కృషి

చేర్యాల, ఫిబ్రవరి 4 : పట్టణంలోని విలువైన స్థలాలను ప్రభుత్వ కార్యాలయాలకు అందించిన కల్వకోట సురేందర్‌రావుతోపాటు ఆయన మామ యాదగిరిరావు విగ్రహాలను ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామని ప్రజాప్రతినిధులు హామీ ఇచ్చారు. ఆదివారం చేర్యాలలో భూదాత కల్వకోట సురేందర్‌రావు సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సభకు ప్రజాప్రతినిధులు, వివిధ కుల సంఘాల ప్రతినిధులు హాజరై సరేందర్‌రావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణానికి సురేందర్‌రావు తన సొంత స్థలాన్ని ఇవ్వడమే కాకుండా రైతులకు ఎన్నో సేవలు చేశారన్నారు. ఆయన పట్వారీగా పని చేశారని, రచయితగా పుస్తకాలు రాశారని గుర్తుచేశారు. ఆయన సేవలను భవిష్యత్ తరాలకు తెలియజేసేందుకు సురేందర్‌రావు, యాదగిరిరావు విగ్రహాలను పట్టణంలో ఏర్పాటు చేస్తామన్నారు. సభలో మున్సిపల్ చైర్‌పర్సన్ స్వరూపారాణీశ్రీధర్‌రెడ్డి, వైస్ చైర్మన్ నిమ్మ రాజీవ్‌రెడ్డి, మద్దూరు ఎంపీపీ బద్దిపడిగె కృష్ణారెడ్డి, సీపీఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి, మాజీ సర్పంచ్ అవుశర్ల యాదయ్య, కౌన్సిలర్ చెవిటి లింగం, నాయకులు పాల లక్ష్మీనారాయణ, దాసరి కళావతి, బండ్ల సూర్యం, అంబాల బుచ్చి రాములు, ఉపేందర్‌రావు, ఉదయ్‌ప్రకాశ్‌తోపాటు కుటుంబ సభ్యులు కాంతికృష్ణ, రాజేశ్వర్‌రావు, సంగీత్ సాయి, రవీందర్‌రావు, వెంకటేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుడి మృతికి సంతాపం

వెంకటయ్య (ఫైల్)

నంగునూరు, ఫిబ్రవరి 4: మండల పరిధిలోని ఘనపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీటీసీ, బీఆర్ఎస్ మాజీ గ్రామ అధ్యక్షుడు బండి వెంకటయ్య ఆదివారం రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. వెంకటయ్య మృతికి మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వెంకటయ్య మృతి బాధాకరమన్నారు. పార్టీలో క్రియాశీలకంగా పని చేసి గ్రామ అభివృద్ధికి ఎంతో కృషి చేశారనిన కొనియాడారు. ఆయన పార్టీకి అందించిన సేవలు మరువలేనివన్నారు. మృతుడి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

మల్లన్న భక్తులకు ఇక్కట్లు

ఆరుబయట స్నానాలు, డబ్బా నీటి కొనుగోలు

- శాలువాలు, లడ్డూలు, దర్శనాలకే పరిమితమైన కమిటీ సభ్యులు
- దూరంగా వాహనాలు నిలుపడంతో మహిళలు, వృద్ధులకు ఇబ్బందులు

ఆదివారం మల్లన్న స్వామి దర్శనానికి పైరవీతో వచ్చి వెనుక ప్రదేశంలో క్యూలో ఉన్న భక్తులు

చేర్యాల, ఫిబ్రవరి 4: సిద్దిపేట జిల్లాలోని కొమురవెల్లి మల్లన్న భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. ఆలయవర్గాలు, పోలీసుల ఆంక్షల వల్ల తిప్పలు తప్పడం లేదు. ఆయా ప్రాంతాల నుంచి కొమురవెల్లికి చేరుకున్న భక్తుల వాహనాలను క్షేత్రానికి దూరంగా పోలీసులు నిలిపివేస్తున్నారు. దీంతో వృద్ధులు, దివ్యాంగులు, మహిళలు తమ సామగ్రి నెత్తిన పెట్టుకొని రాలేకపోతున్నారు. స్వామి వారిని దర్శించుకునేందుకు వేకువజామునే ఆలయ క్యూలోకి వచ్చిన భక్తులు గంటల పాటు వేచి ఉండాల్సి వస్తున్నది. మల్లన్నను దర్శించుకుని వెళ్లిపోయే మార్గంలోని ఎగ్జిట్‌గేట్ నుంచి భక్తులు ఎదురుగా వచ్చి స్వామివారిని దర్శించుకుంటుండడంతో దానిని నిరోధించేందుకు గేట్‌కు తాళం వేశారు.ఆలయానికి ఆనుకుని ఉండే వీఐపీ గెస్ట్ హౌస్ నంబర్ వన్ నుంచి భక్తులు ఆలయంలోకి పైరవీలతో ప్రవేశిస్తుండడంతో ఇక సామాన్య భక్తులు మల్లన్న దర్శనం కోసం గంటల పాటు వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. స్వామి వారి క్షేత్రంలో దాతలు నిర్మించిన గదులు భక్తులతో నిండిపోయాయి. దాతల సహకారంతో నిర్మించిన గదుల్లో కొన్ని ఆలయవర్గాలు, మరికొన్ని ఆలయ కమిటీ ప్రతినిధులు, అధికారులు బుక్‌చేసుకోవడంతో భక్తులకు సక్రమంగా గదులు దొరకడం లేదు. ప్రైవేట్‌లో గది అద్దెకు తీసుకుంటే రూ.3000 చెల్లించుకోవాల్సి వస్తున్నది. భక్తుల సమస్యలు పరిష్కరించి ప్రశాంత వాతావరణంలో దర్శనం చేయించే విధంగా చర్యలు తీసుకోవాల్సిన ఆలయ పునరుద్ధరణ కమిటీ పెద్దలు మొదలుకొని కమిటీ సభ్యులు కేవలం వీఐపీలు, బంధువులు, స్నేహితులకు దర్శనాలు చేయించే పనిలో నిమగ్నమయ్యారు. దీనికి తోడు కొబ్బరికాయలు అధిక ధరలకు విక్రయిస్తున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. గదులు లేక భక్తులు ఆరుబయట స్నానాలు చేసేందుకు డబ్బానీళ్లు కొనుగోలు చేస్తున్నారు. కల్యాణకట్ట వద్ద నాయీబ్రాహ్మణులు రూ.50 నుంచి రూ.100 చెల్లిస్తే తలనీలాలు తీస్తున్నారు. కొందరు ప్రైవేట్ వ్యక్తులు ఎలాంటి అనుమతి లేకుండా ఆలయం, కార్యాలయాలు తదితర ప్రాంతాల్లో తిరుగుతున్నా ఆలయవర్గాలు పట్టించుకోవడం లేదు.

అన్నదాతకు తప్పని ఇబ్బందులు

మాట్లాడుతున్న దాత శంకర్‌యాదవ్

చేర్యాల, ఫిబ్రవరి 4: కొమురవెల్లి మల్లన్న క్షేత్రంలో స్వామివారి బ్రహ్మోత్సవాల భాగంగా 7 ఆదివారాలపాటు ఏటా 4 వేల మందికి అన్నదానం చేస్తున్న మల్లన్న భక్తుడు శంకర్‌యాదవ్‌కు ఆలయ వర్గాలు, పోలీసుల చర్యలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. ప్రతి ఆదివారం భక్తులకు అన్నదానం చేసేందుకు శనివారం రాత్రి వరకు హైదరాబాద్ నుంచి కొమురవెల్లికి అన్నదానం తయారు చేసేందుకు అవసరమైన సిబ్బంది, సామగ్రితో శంకర్‌యాదవ్ చేరుకుంటారు. కానీ ఈసారి ఆలయ వర్గాలు, పోలీసుల ఆంక్షలతో స్వామి వారి క్షేత్రానికి దూరంగా వాహనాలు నిలిపివేయడంతో అక్కడి నుంచి వంట సామగ్రి, వస్తువులను కార్మికులు నెత్తిన పెట్టుకొని రాలేక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దాత శంకర్‌యాదవ్ తమ వాహనాలకు అనుమతి ఇవ్వాలని పోలీసులు, ఆలయ వర్గాలను కోరినా వారు పట్టించుకోలేదు. దీంతో శంకర్‌యాదవ్ మానసిక ఆందోళనకు గురై అక్కడి నుంచి సామగ్రి, సిబ్బందిని తీసుకొచ్చి ఆదివారం భక్తులకు అన్నదానం చేశారు. అనంతరం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పోలీసులు, ఆలయ వర్గాల ఆంక్షలతో ఇబ్బందులు పడుతున్నామని, ఇదే పద్ధతి కొనసాగితే ఇక అన్నదానం నిర్వహించడం నిలిపివేస్తానని ఆవేదన వ్యక్తం చేశారు. ఆలయ వర్గాలు శ్రద్ధ వహించి వేలాది భక్తులకు ఉపయోగపడే అన్నదాన కార్యక్రమం కొనసాగేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

'మల్లన్న' క్షేత్రంలో దర్శన పాస్‌ల విక్రయం

- ముగ్గురిని పట్టుకున్న ఆలయ పునరుద్ధరణ కమిటీ సభ్యులు

చేర్యాల, ఫిబ్రవరి 4 : కొమురవెల్లి మల్లన్న క్షేత్రంలో స్వామివారి దర్శనాలకు సంబంధించిన పాస్‌లను కొందరు దొంగచాటుగా విక్రయిస్తూ జేబులు నింపుకొంటున్నారు. స్వామివారి బ్రహ్మోత్సవాలను అదునుగా భావించి కొందరు వ్యక్తులు స్వామివారి దర్శనాలకు సంబంధించిన రూ.500 పాస్‌లను తక్కువ ధరలకు విక్రయిస్తున్నారు. ఆలయ పునరుద్ధరణ కమిటీ సభ్యులు ఆదివారం పాస్‌లు విక్రయిస్తున్న ముగ్గురిని అదుపులోకి తీసుకొని వారి నుంచి సుమారు 100 పాసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ పర్పాటకం లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. వీఐపీ దర్శనం చేసుకునేందుకు భక్తుడు రూ.500 ఇచ్చి పాస్ కొనుగోలు చేస్తాడన్నారు. ఒక్కో పాసుపై కనీసం ఐదుగురు భక్తులు రూ.2500 చెల్లించి పాసు కొనుగోలు చేయాల్సి ఉంటుందన్నారు. ఇలాంటి పాసులను కొందరు వ్యక్తులు రూ.500 నుంచి రూ.1000కి ప్రతి ఆదివారం దొంగచాటుగా ఆలయంలో పనిచేసేవారి సహకారంతో విక్రయిస్తున్నారని తెలిపారు. ఆలయంలో పనిచేసే ఓ సిబ్బంది పాత్ర ఉన్నట్లు తమకు సమాచారం వచ్చిందని, పాసులతో దొరికిన వారిని పోలీసులకు అప్పగించామన్నారు. ఈ ఘటనపై ఆలయ ఈవో పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. పోలీసుల విచారణ అనంతరం ఆలయ సిబ్బందితో పాటు క్షేత్రంలో పాసులు విక్రయిస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

కొండగట్టు, కొమురవెల్లి ఏఈవోలకు స్థానచలనం

చేర్యాల, ఫిబ్రవరి 4 : తెలంగాణలోని ప్రముఖ ఆలయాలైన కొమురవెల్లి మల్లికార్జునస్వామి, కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయాల ఏఈవోలకు స్థానచలనం కల్పిస్తూ రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ అనిల్‌కుమార్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. కొండగట్టు ఆలయ ఏఈవోగా పనిచేస్తున్న వైరాగ్యం అంజయ్య ఏడాదిన్నర క్రితం కొమురవెల్లి ఆలయానికి డిప్యుటేషన్‌పై వచ్చి విధుల్లో చేరారు. ఇటీవల ఆయనపై ఆలయ పునరుద్ధరణ కమిటీ సభ్యులు కమిషనర్‌కు ఫిర్యాదు చేయడంతో అంజయ్యను మెదక్ దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ కార్యాలయంలో ఏఈవోగా విధులు నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఏఈవో వైరాగ్యం కోర్టును ఆశ్రయించి డిప్యుటేషన్ ఆర్డర్స్‌ను సస్పెండ్ చేయించుకున్నారు. అనంతరం జరిగిన పరిణామాలతో అంజయ్యను తిరిగి కొండగట్టు ఆలయంలో యథాస్థానానికి పంపించారు. అక్కడ ఏఈవోగా ఉన్న శ్రీనివాస్‌ను కొమురవెల్లి ఆలయ ఏఈవోగా విధులు నిర్వహించాలని ఉత్తర్వులు జారీ చేశారు.

కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి

- హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్

హుస్నాబాద్, ఫిబ్రవరి 4: రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్ పిలుపునిచ్చారు. హుస్నాబాద్‌లో నిర్వహించిన బీఆర్ఎస్ ముఖ్యకార్యకర్తల సమావేశానికి ఆదివారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కరీంనగర్ ఎంపీ స్థానం నుంచి పోటీ చేయనున్న బోయినపల్లి వినోద్‌కుమార్‌నే ఎంపీగా గెలిపించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని సూచించారు. ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో జరుగుతున్న నిర్లక్ష్యం, అమలుకాని పథకాల తీరుపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో జరిగిన పొరపాట్లను సరిదిద్దుకుంటూ వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో హుస్నాబాద్ నియోజకవర్గంలో బీఆర్ఎస్‌కే ఓట్లు వేసేలా ప్రజల్లో చైతన్యం కల్పించాలన్నారు. ఎంపీగా ఉన్నప్పుడు వినోద్‌కుమార్ ఈ ప్రాంత అభివృద్ధికి ఎంతో కృషిచేశారన్నారు. వరంగల్ పార్లమెంట్ అభ్యర్థిగా ప్రస్తుత హనుమకొండ జిల్లా పరిషత్ చైర్మన్ డాక్టర్ సుధీర్‌కుమార్‌కు అవకాశం కల్పించాలని బీఆర్ఎస్ అధినాయకత్వాన్ని కోరుతూ హుస్నాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ కార్యకర్తలు ఏకగ్రీవ తీర్మానం చేసినట్లు తెలిపారు. అనంతరం బీఆర్ఎస్ నాయకుడు మల్లికార్జున్‌రెడ్డి పుట్టినరోజు కేకును పార్టీ కార్యాలయంలో కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. సమావేశంలో వరంగల్ జడ్పీచైర్మన్ డాక్టర్ సుధీర్‌కుమార్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు శ్రీహరి, మున్సిపల్ వైస్ చైర్మన్ అనిత, ఎంపీపీలు మానస, లక్ష్మి, వెంకట్రామ్‌రెడ్డి, సాంబరాజు, ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

కొండపోచమ్మ అమ్మవారిని దర్శించుకున్న ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య

కొండపోచమ్మ ఆలయ అభివృద్ధికి కృషి

- ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

జగదేవ్‌పూర్, ఫిబ్రవరి 4 : కొండపోచమ్మ ఆలయం అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఆలేరు శాసన సభ్యులు, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు. ఆదివారం మండలంలోని ప్రసిద్ధ కొండపోచమ ఆలయాన్ని ఆయన సందర్శించి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ పూజారులు ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ అభివృద్ధి గురించి సీఎంకు వివరించి నిధులు మంజూరు చేయిస్తానన్నారు.

కొండపోచమ్మను దర్శించుకున్న మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్..

కొండపోచమ్మ ఆలయ జాతరలో భాగంగా మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు ఆలయ అర్చకులు ఘనస్వాగతం పలికి సన్మానించారు. వారి వెంట ఆలయ ఈవో మోహన్‌రెడ్డి, ఆలయ అధికారులు వెంకట్‌రెడ్డి, సిబ్బంది తదితరులు ఉన్నారు.

విప్‌ను కలిసిన నాయకులు

చేర్యాల, ఫిబ్రవరి 4 : చేర్యాల పట్టణంలో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యను ఆదివారం చేర్యాల, కొమురవెల్లి కురుమ సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను ఘనంగా సన్మానించారు.

కూటిగల్‌లో సమ్మక్క-సారలమ్మ గద్దెల వద్ద పాట చిత్రీకరణలో పాల్గొన్న నటీనటులు

'సమ్మక్క-సారలమ్మ' జాతర పాట చిత్రీకరణ

మద్దూరు(ధూళిమిట్ట), ఫిబ్రవరి 4 : ధూళిమిట్ట మండలం కూటిగల్ సమ్మక్క-సారలమ్మ గద్దెల ప్రాంగణంలో కేకే మ్యూజిక్ డైరెక్టర్ కేమిడి కనకరాజు స్వీయ దర్శకత్వంలో 'కుర్రోయమ్మ.. కుర్రు..!, చిలకలాది గట్టు అబ్బియా..!' అనే ప్రత్యేక భక్తి పాటను ఆదివారం చిత్రీకరించారు. ప్రముఖ ప్రజా గాయకుడు పిన్నింటి రత్నం క్లాప్ కొట్టి షూటింగ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా కేకే మ్యూజిక్ డైరెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ పల్లె సంస్కృతి, సంప్రదాయాలకు నెలవైన ప్రాంతమని, సమ్మక్క-సారలమ్మల పోరాట స్ఫూర్తితో తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీసీసీబీ జిల్లా డైరెక్టర్ ఆలేటి యాదగిరి, గ్రామస్తులు పాల్గొన్నారు.

పట్టభద్రులు ఓటరుగా నమోదు చేసుకోవాలి

మద్దూరు(ధూళిమిట్ట), ఫిబ్రవరి 4 : మండలంలోని పట్టభద్రులు ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసుకోవాలని బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు సుమన్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 01-11-2020 తేది వరకు ఏదైనా డిగ్రీలో ఉత్తీర్ణులైనవారు ఈనెల 6లోపు ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. త్వరలో జరుగనున్న ఖమ్మం-వరంగల్-నల్లగొండ పట్టభద్రుల శాసన మండలి ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకునే వీలుంటుందన్నారు.

ఆర్థిక సాయం అందజేత

గజ్వేల్, ఫిబ్రవరి 4: నిరుపేద కుటుంబానికి ఆపన్నహస్తం మిత్రబృందం సభ్యులు అండగా నిలిచారు. మండల పరిధిలోని రిమ్మనగూడ గ్రామానికి చెందిన సిద్ధాల శివకుమార్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మిత్రబృందం సభ్యులు ఆదివారం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.15 వేలతోపాటు నిత్యవసర సరుకులు అందజేశారు. పరామర్శించిన వారిలో ఆపన్నహస్త మిత్రబృందం అధ్యక్షుడు బాలచంద్రం, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, సభ్యులు శ్యామ్‌ప్రసాద్, సాయి, స్వామి ఉన్నారు.

రాష్ట్ర స్థాయి ప్రదర్శనకు ఎంపిక

రాష్ట్ర స్థాయి ప్రదర్శనకు ఎంపికైన ప్రాజెక్టు

గజ్వేల్, ఫిబ్రవరి 4 : 2023-24 విద్యాసంవత్సరానికి ఆన్‌లైన్‌లో ఏడాదిపాటు నిర్వహించిన ఇన్స్పైర్ ప్రదర్శనలో జిల్లా వ్యాప్తంగా 156 మంది విద్యార్థులు పాల్గొన్నారు. అందులో నుంచి 15 ప్రాజెక్టులు రాష్ట్రస్థాయి ప్రదర్శనలకు ఎంపికయ్యారు. ఇందులో మండల పరిధిలోని అహ్మదీపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థులు బి.రాకేశ్ అమెజింగ్ అంబ్రెల్లా, ఎం.లక్ష్మీనర్సింహా గౌడ్ ఆటోమెటిక్ బ్లాక్ బోర్డు క్లినర్ ప్రాజెక్టులు ఎంపికైనట్లు పాఠశాల గైడ్ హఫీజ్ తెలిపారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులు, గైడ్ హఫీజ్‌ను డీఈవో శ్రీనివాస్‌రెడ్డి, హెచ్ఎం సుగుణాకర్, జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాస్ అభినందించారు.

రాజేశ్వర్‌రెడ్డి సేవలకు గుర్తింపు

సిద్దిపేట టౌన్, ఫిబ్రవరి 4 : సిద్దిపేటకు చెందిన ప్రముఖ జ్యోతిష్యుడు కలకుంట్ల రాజేశ్వర్‌రెడ్డికి సాహిత్య, జ్యోతిష్య రంగాల్లో చేసిన సేవలకు అవార్డులు దక్కాయి. స్వామి వివేకానంద, సుభాష్‌చంద్రబోస్ జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని యువచైతన్య వెల్ఫేర్ సొసైటీ, విశ్వకర్మ సేవా ఫౌండేషన్ వారు ఆదివారం వరంగల్‌లో అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. సాహిత్య రంగంలో రాజేశ్వర్‌రెడ్డి చేసిన సేవలకు తెలుగు లెజండరీ అవార్డు, జ్యోతిష్య రంగంలో సేవలందించినందుకు జాతీయ మహానంది అవార్డులు అందజేశారు. కార్యక్రమంలో యువచైతన్య వెల్ఫేర్ సొసైటీ, విశ్వకర్మ సేవా ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవలకు గుర్తింపు

అక్కన్నపేట, ఫిబ్రవరి 4: మండల కేంద్రానికి చెందిన రైతు ఉత్పత్తిదారుల సంఘాల ప్రతినిధి, జర్నలిస్ట్ నారదాస్ ఈశ్వర్‌ను ఆదివారం మాజీ సర్పంచ్ ముత్యాల సంజీవరెడ్డి, గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. కేంద్ర ప్రభుత్వ ఆహ్వానం మేరకు ఇటీవల ఢిల్లీలోని ఎర్రకోట వద్ద జరిగిన గణతంత్ర వేడుకలకు ఈశ్వర్ హాజరయ్యారు. కార్యక్రమంలో గ్రామస్తులు మల్లారెడ్డి, ఎల్లయ్య, శ్రీనివాస్‌రెడ్డి, నక్క బాలయ్య, వెంకటయ్య, కొమురయ్య, ఎలసాని వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

రాయితీని సద్వినియోగం చేసుకోవాలి

- సిద్దిపేట పోలీస్ కమిషనర్ అనురాధ

సిద్దిపేట అర్బన్, ఫిబ్రవరి 4: ఈ-చలాన్ పెండింగ్ ఉన్న వాహనదారులకు ప్రభుత్వం రాయితీ ప్రకటించిందని సిద్దిపేట పోలీస్ కమిషనర్ బి.అనురాధ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 15లోపు వాహనదారులు ఆన్‌లైన్ ద్వారా పెండింగ్‌లో ఉన్న ఈ-చలాన్లు చెల్లించాలన్నారు. ద్విచక్ర వాహనాలకు 80 శాతం రాయితీ, ఆర్టీసీ బస్సులు, ఆటోలు, తోపుడు బండ్లకు 90 శాతం, నాలుగు చక్రాల వాహనాలు, భారీ వాహనాలకు 60 శాతం రాయితీ వర్తిస్తుందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నేడు బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం

బెజ్జంకి, ఫిబ్రవరి 4: తిమ్మాపూర్ మండలం అలుగునూర్‌లో నేడు (సోమవారం) జరిగే బీఆర్ఎస్ ముఖ్యకార్యకర్తల సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ మండలాధ్యక్షుడు పాకాల మహిపాల్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సమావేశానికి రాష్ట్ర మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు, మాజీ ఎంపీ వినోద్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ హాజరవుతారని తెలిపారు. పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు.

ఐదు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

హుస్నాబాద్ రూరల్, ఫిబ్రవరి 4 : మండలంలోని పలు వాగుల నుంచి ఇసుకను అక్రమ రవాణా చేస్తున్న ఐదు ట్రాక్టర్లను ఆదివారం పట్టుకున్నట్టు హుస్నా బాద్ ఎస్సై మహేశ్ తెలిపారు.

బోరు వేయకుండా అడ్డుకున్న గ్రామస్తులు

బెజ్జంకి, ఫిబ్రవరి 4: మండలంలోని గుగ్లిళ్ల గ్రామ శివారులో ఇథనాల్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేసే స్థలంలో ఆదివారం బోరు వేసేందుకు నిర్వాహకులు ప్రయత్నించగా, గ్రామస్తులు అడ్డుకున్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
WANTED
★ త్రివేణి హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. 9160900024 / 9640400073.
NT-319429-All
గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

బ్యాంకు మేనేజర్ ఇంట్లో చోరీ

- 37 తులాల బంగారం అపహరణ

సిద్దిపేట టౌన్, ఫిబ్రవరి 4: బ్యాంకు మేనేజర్ ఇంట్లో 37 తులాల బంగారు ఆభరణాలను దుండగులు ఎత్తుకెళ్లిన ఘటన సిద్దిపేట టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సీఐ ఉపేందర్ వివరాల ప్రకారం.. సర్కిల్ పరిధిలోని మహాశక్తినగర్‌లో నివాసం ఉంటున్న యూనియన్ బ్యాంకు మేనేజర్ సుమన్ తన కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం బంధువుల ఇంటికి వెళ్లాడు. ఇదే అదునుగా భావించిన దుండగులు ఇంటి తాళాలను పగులగొట్టి బీరువాలోని 37 తులాల బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లారు. శనివారం రాత్రి బ్యాంకు మేనేజర్ ఇంటికి వచ్చి చూడగా, ఇంటి తాళం, బీరువా ఓపెన్ చేసి ఉంది. చోరీ జరిగిందని గ్రహించి వెంటనే పోలీసులకు సమాచారం అందజేశారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని క్లూస్ టీమ్ సిబ్బందితో ఆధారాలు సేకరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ ఉపేందర్ తెలిపారు.

చెత్త బుట్టల పంపిణీ కోసం సర్వే

హుస్నాబాద్ టౌన్, ఫిబ్రవరి 4: హుస్నాబాద్ మున్సిపల్ పరిధిలో ఇంటింటా చెత్త సేకరణ కోసం చెత్త బుట్టల పంపిణీ చేసేందుకు ఆదివారం మున్సిపల్ అధికారులు సర్వే నిర్వహించారు. ఇంటి నంబర్ల కంటే అధికంగా కుటుంబాలు నివసిస్తున్నాయని, దీంతో చెత్త సక్రమంగా వాహనాలకు రావడం లేదని అధికారులు గుర్తించారు. కుటుంబాల ఆధారంగా తడి, పొడి చెత్త బుట్టలు పంపిణీ చేయాలని ఇప్పటికే మున్సిపల్ పాలకవర్గం తీర్మానించింది. కార్య